ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 7 పుష్పం : 16-18 20-12-2002

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 20

**VOL : 8** **ISSUE : 07**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260

## స్వరూపం ఎప్పుడూ అరూపమే

ఆకారం ఉన్నదానికి వికారం వస్తుంది. ఆకారంలేని ఆత్మకు వికారం లేనేలేదు. అది వస్తురహితంగా, విషయరహితంగా కేవలం చైతన్యంగా ఉంది. వాస్తవంగా జీవుడు లేడు, ఉన్నవాడిలా కనిపిస్తున్నాడు. అది ఆత్మయొక్క అతిశయశక్తి "నేను శరీరమును కాను, నాకు ఒక శరీరం ఉంది నేను ఆత్మను" అనే విశ్వాసం మన రక్తంలో అణువుఅణువునా జీర్ణించుకొంటే సత్యజ్యోతులు ప్రకాశిస్తాయి. కొమ్మమీద కూర్చున్న పక్షి గాలికి కొమ్మ ఊగినా తాను పడిపోనని తనకు రెక్కలు ఉన్నాయని దానిమీద ఆధారపడగలనని నిశ్చంతగా ఉంటుంది. అలాగే మనం సంసారంలో ఉన్నా, భార్యబిడ్డలే ఆధారమని భ్రమించక నేను పరమాత్మనే అనే నిశ్చయజ్ఞానంలో ఉండాలి. తల్లినుంచి తప్పిపోయిన ఒక సింహపుకూన, మేకల మందలో కలసి "మే" అంటూ కూస్తూ అలాగే జీవించటం ప్రారంభించింది. కొంతకాలానికి దానితల్లి అటుగావచ్చి దానితో యిలాఅంది "వేటాడి మాంసాన్ని భుజించటం మన జీవనవిదానం" అని దానికి ప్రత్యక్షంగా చూపగా ఆ సింహం కూన తల్లివలె మారి, సింహగర్జన చేసింది. అలాగే జీవులుగా భ్రమలో జీవించే మనలను తల్లిలాంటి గురువు "అనాదిగా నీవు ఆత్మస్వరూపుడవే గాని దేహాదులతో తాదాప్యం పొందే ఈ మరుపు విచిత్రం. నీవు యిలా భ్రమిస్తున్న కాలంలో కూడా ఆత్మవే "అనే గురువు యొక్క హితవచనాలను గ్రహించిన సాధకుడు సుఖపడతాడు. నశించే శరీరాన్ని శాశ్వతం అనుకోవటం, దానికి ఆత్మభావన కల్పించుకోవటమే "మాయ". అందులోనుండి బయటపడి క్రొత్తదృష్టిలో నిలవటానికి సాధకునికి కొంత కాలవ్యవధి అవసరం. అనేక వేల జన్మలనుంచి ఈ శరీరం నేను అనుకొంటూ, మన బుద్ధి యొక్క వైభవాన్ని తెలుసుకొంటూ మురిసిపోతూ వాటితో దృడబంధంలో స్థిరపడిపోయాము. ఈ బంధం నిజంకాదు అని ఒక్కసారి తెలుసుకొంటే సరిపోదు, కృషితో దీక్షతో ధ్యానించి, మన స్వరూపంలో నిలవటం అవసరం. " ఆయా వస్తువుల బాహ్యస్వరూపమును దాటి సత్యస్వరూపమును గాంచుటయే వేదాంతం యొక్క బోధ. రూపదృష్టితో బంధించబడిపోయిన మనం దేవుణ్ణి కూడా రూపదృష్టితో చూడాలని భావిస్తున్నాము. ఎవరైతే నామరూపాలనుంచి బైటపడరో వారు కోటి జన్మలు ఎత్తినా సత్యాన్ని దర్శించలేరు. కాని మన నామరూపాల దృష్టి పోవటానికి సద్గురువు నామరూపాలపై దృష్టిని నిలపుకొంటే మన నామరూపాల్లోంచి బైటపడతాము భ్రమర కీటక న్యాయంలా. సత్యదర్శనంతో గురురూపం కూడా అణిగిపోయి, నిత్యానందమయంగా నిలుచుస్థితి కలుగుతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**

అర్ధవరం

**ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

20-11-02 అరుణాచలం ........ 3
24-11-02 పాలకొల్లు ........ 7
28-11-02 పాతాళ్లమెరక ........ 12

Visit us @ www.srinannagaru.com

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-11-02, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ క్షేత్రంలో విశేషం ఏమిటి అంటే ఇక్కడ దేవుడు పేరు అరుణాచలేశ్వరుడు, ఊరుపేరు అరుణాచలం, కొండపేరు అరుణాచలం. దీనిని అన్నామలై అంటారు. ఇప్పుడు దీనిని తిరువణ్ణామలై అని పిలుస్తున్నారు. అరుణాచలం అంటే ఎర్రని కొండ. ప్రపంచం అంటే పంచభూతాలు, జీవులు. జీవులు ఈ భూమి మీదకు వస్తూ ఉంటాయి. పోతూ ఉంటాయి. పంచభూతాలకు క్షేత్రాలు ఉన్నాయి అందులో అగ్నికి సంకేతం ఈ క్షేత్రం. ఇది భారతదేశంలో ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రంలో అత్యంత ముఖ్యమైనది గిరి. ఈ గిరి యొక్క ప్రాముఖ్యత స్కాంధ పురాణంలో చెప్పారు. ఇక్కడ శివుడు గిరిరూపంలో ఉన్నాడు అని చెపుతారు. అందుచేత మీరు ఆ గిరి చుట్టూ తిరుగుతూ ఉంటే నా చుట్టూ తిరుగుతున్నారు అని శివుడు అనుకొంటాడు. అలా అనుకోవటమే కాదు మీ కోరికలు ఏమైనా ఉంటే వాటిని నెరవేరుస్తాడు. మీరు కోరికలు లేకుండా తిరుగుతూ ఉంటే మీకు కావలసినవి అన్నీ ఇస్తాడు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు. ఆయన మనకంటే తెలివిగలవాడు. మనఅవసరాలు అన్నీఆయనకు తెలును అన్న సంగతిమనకుతెలియటం లేదు. భగవాన్ శ్రీరమణమహర్షి ఈ క్షేత్రానికి ఆకర్షింపబడ్డారు. రమణమహర్షి గారికి దేనితోనైనా అనుబంధం ఉంది అంటే ఆ గిరితోనే అనుబంధం ఉంది. ఈ గిరిని ధ్యానించటం వలన, స్మరించటం వలన మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది అని చెప్పారు. అరుణాచలం గురించి ఆయన ఏ పుస్తకంలోను చదవలేదు. బంధువు ద్వారా ఆయన అరుణాచలం పేరు విన్నప్పుడు అరుణాచలం అనగానే ఆయనకు భగవంతుడే స్ఫురించాడు, అది జన్మాంతర అనుబంధం. 54 సంవత్సరాలు ఈ అరుణాచలంలో ఉన్నాను. అరుణాచలం విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలి అనే తలంపు కూడా రాలేదు అన్నారు భగవాన్. తలంపు వచ్చాక నిగ్రహించుకోవటం కాదు, అసలు తలంపే రాలేదు అన్నారు. అరుణాచలేశ్వరుడి పట్ల ఆయనకు జనకభావం ఉండేది. 1896వ సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీన ఆయన అరుణాచలం వచ్చారు. మొదట అరుణాచలేశ్వరుడి ఆలయానికి వెళ్ళారు. నాకు భక్తిని ప్రసాదించు, జ్ఞానాన్ని ప్రసాదించు, వైరాగ్యాన్ని ప్రసాదించు అని ఆయన అడగలేదు. ఓ తండ్రీ నువ్వు రమ్మంటే వచ్చాను అన్నారు. ఇంటి దగ్గర లెటరులో ఏమని వ్రాసాడు అంటే ఇది ఒక మంచిపనిచేయటానికి వెడుతోంది. మీరు ఎవరు దుఃఖపడవద్దు, ఇది ఎక్కడ ఉంది అని వెతకటానికి ప్రయత్నంచేయవద్దు, డబ్బు ఖర్చుపెట్టవద్దు అని వ్రాసాడు. క్రింద సంతకం చేయలేదు. ఎందుచేతనంటే సంతకం చేసేవాడు అక్కడలేడు, అప్పటికే చనిపోయాడు. అరుణాచలం వచ్చినరోజునే శివుడి దర్శనానికి వెళ్లి మీ ఆజ్ఞననుసరించి వచ్చాను, నా అంతట నేనురాలేదు, ఈ దేహాన్ని ఎలా ఉపయోగించుకొంటావో అలా ఉపయోగించుకో అని పనిముట్టు క్రింద అయిపోయాడు. అది నిజమైన శరణాగతి మేము బిక్షకోసం వెళుతున్నాము, మీరు అరుణాచలేశ్వరుడి మీద ఏదైనా చెబితే అది పాడుకొంటూ బిక్షచేసుకొని వస్తాము అని అడిగితే అక్షరమణమాల చెప్పారు. ఈ అక్షరమణమాల మనకు చాలాకాలం అన్నంపెట్టింది



అని భగవాన్ నవ్వుతూ అనేవారు. అక్షరమణమాలలో అన్ని రసాలు ఉంటాయి. మణమాల అంటే పెండ్లినాటి మాల. పెండ్లి నాటి మాల మామూలుగా పుష్పాలతో తయారు చేస్తారు కాని ఇక్కడ భగవాన్ అక్షరములతో తయారుచేసారు. ఇక్కడ పెండ్లి కుమారుడు అరుణాచలేశ్వరుడు, పెండ్లి కుమార్తె రమణమహర్షి. అక్షరములతోతయారు చేసిన ఈ మాలను అరుణాచలేశ్వరుడి మెడలో వేసి, నువ్వు కూడా నా మెడలో వేయాలి కదా నీ దయ, కరుణ అనుగ్రహంతో తయారుచేసిన మాలను నా మెడలోవెయ్యాలి అన్నారు భగవాన్.

1950వ సంవత్సరం ఏప్రియల్ 14వ తేదీన భగవాన్ శరీరం వదిలిపెట్టారు. గురువు అంటే మనం శరీరానికి పరిమితం చేస్తున్నాము, అలా చేస్తే ఆయననుఅగౌరవ పరచినట్లు అవుతుంది. గురువు అంటే ఆత్మ, గురువు అంటే చైతన్యం. ఆ శరీరం ఒక గుల్ల మాత్రమే. మనం ఏదైనా మాట్లాడాలి అంటే నోరు ఉండాలి కాబట్టి రమణమహర్షి నోరును ఈశ్వరుడు ఉపయోగించుకొన్నాడు. శరీరం ఉండగానే వారికి శరీరంతో సంబంధం ఉండదు. మనకు శరీరబుద్ధి ఉందికాబట్టి వారు కూడా ఆ శరీరానికి పరిమితం అనుకొంటాము. ఈ కొండ అంతా రాళ్లగుట్టక్రింద కనిపిస్తోంది. దానిని మీరు శివుడుఅంటున్నారు ఏమిటి అని ఒక ప్లీడరుగారు భగవాన్ను అడుగుతున్నారు. నీ శరీరంతో నీవు ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ పరమేశ్వరుడు ఆ కొండతో తాదాప్యం పొందుతున్నాడు. నీ శరీరంతో నీవు తాదాప్యం పొందుతున్నావు అది నీకు పొరపాటు అనిపించటంలేదు కాని శివుడు ఆ కొండతో తాదాప్యం పొందటం నీకు పొరపాటు అనిపిస్తోంది. నీ శరీరానికి నమస్కారంపెడితే నాకు నమస్కారం పెడుతున్నారు అని ఎలా అనుకొంటున్నావో అలాగ ఆ కొండను ఎవరైనా పూజిస్తే నాకే పూజలు చేస్తున్నారు అని శివుడు అనుకొంటున్నాడు. కాని ఇవి అన్నీ వ్యవహారికసత్యాలే గాని పారమార్ధికసత్యాలు కాదు. అరుణాచలం అని స్మరించాను అంతే నా పని పూర్తి చేసేసావు. నీ మహిమ ఇట్టిది అని అనుభవం ఉన్నవారికి తెలుస్తుంది గాని అనుభవంలేనివారికి ఎలా తెలుస్తుంది. ఈ శరీరం భూమి మీద తిరుగుతుండగానే మనిషిని చంపేస్తావు అంటే ఈ శరీరంతో తాదాప్యం పొందే నేనును చంపేస్తాడు. అప్పుడు మీ శరీరానికి చావు వచ్చినా ఆ చావుకు మీకు ఏమీ సంబంధం లేదు అన్న సంగతి మీకు తెలుస్తుంది. ఈ మాటలు ఇతరులకు చెప్పటం నీకు ఇష్టం ఉండదు. నీకు ఇష్టంలేని పనిని నేను చేస్తున్నాను కాబట్టి నన్ను క్షమించి, ఆశీర్వదించు అన్నారు భగవాన్. మనకు పవిత్రత చాలా ముఖ్యం. మనకు ఎందుకు జ్ఞానం రావటంలేదు అంటే ఈశ్వరుడు ఎంత పవిత్రుడో మనకు అంత పవిత్రతలేదు, మన మనస్సు అంత పరమపవిత్రమైతే నీరునీరులో కలిసిపోయినట్లు మనం బ్రహ్మంలో ఐక్యమవుతాము. ఎవరైతే అరుణాచలం, అరుణాచలం అని నిరంతరం స్మరించుకొంటున్నారో వారు నెమ్మదిగా పవిత్రులవుతారు, బ్రహ్మంలో ఐక్యమవుతారు. మనకు అహంకారం పెరుగుతూంటే తిప్పలు పెరుగుతాయి. అహంకారాన్ని తొలగించటానికి వచ్చిన క్షేత్రం ఇది. మాకు ఇంటిదగ్గర బాగానే ఉంది అరుణాచలం వచ్చాక అహంకారం పెరుగుతోంది ఏమిటి అని కొంతమంది అడుగుతున్నారు. అలా ఎందుకు చేస్తున్నాడు అంటే మీలో ఎంత అహంకారం ఉందో మీకు చూపించకుండా ఈశ్వరుడు కూడా బయటకు తీయడు. జ్యోతి ప్రజ్వలన ప్రాముఖ్యత ఏమిటి అంటే ఈ రోజున ఈశ్వరుడు

బ్రహ్మదేవునికి, విష్ణుదేవునికి జ్యోతి రూపంలో ఇక్కడ దర్శన మిచ్చాడు. దానికి సంకేతంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్నారు. అరుణాచలంలో ఈశ్వరుడు 3 రూపాలలో ఉన్నాడు అని చెపుతారు. గిరిరూపం, లింగరూపం, కొండమీద సిద్దరూపంలో ఉన్నాడుఅంటే శరీరంధరించి ఉన్నాడు అని చెపుతారు.

మనస్సును బాహ్యాముఖం చేయవద్దు. దానికి లోచూపు నేర్పండి, దానికి లోచూపు అలవాటు అయితే మనస్సు అణుగుతుంది. మనస్సు అణిగితే గాని ఆత్మజ్ఞానం రాదు. మన మనస్సు అణగకపోతే మనం ఎన్ని పూజలు చేసినా, సాధనలు చేసినా ప్రయోజనం లేదు. మీ దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి మీరు జ్ఞానాన్ని సంపాదించటానికి ప్రయత్నం చేయండి. మీ రోజులు బాగా వెళ్ళినా, బాగా వెళ్ళకపోయినా రెండూ స్వప్నమే. ఈ ప్రపంచం ఎప్పుడూ నేను ఉన్నాను అని చెప్పలేదు. భగవంతుడు కనిపించి నేను ఉన్నాను అని చెప్పటంలేదు. తెలియని గొడవలు నీకు ఎందుకు, నీ మనస్సు నీకు తెలుస్తోంది, దానిని పరిష్కారం చేసుకో. అరుణగిరి మీకు కొండలాగ, రాళ్ళగుట్టలాగ కనిపిస్తుంది గాని అది కొండకాదు, ఈశ్వరునిదయ, కరుణ, అనుగ్రహం అలా గుట్టలాగ ఘనీభవించింది. ఇది కరుణాసముద్రం. అది మామూలు కొండలాగ మీకు కనిపిస్తోంది గాని, మీకు లోపల నేత్రం తెరువబడినప్పడు అది దయాసముద్రం అని మీకు తెలుస్తుంది. మీ ప్రారబ్దంలో ఏదైనా చెడు జరిగినప్పడు అదికూడా భగవంతుడి దయే అని మీరు గుర్తించినప్పడు మీకు తొందరగా జ్ఞానోదయం అవుతుంది. ఒకో మనిషికి ఒకో స్వభావం ఉంటుంది. వారి స్వభావాన్ని బట్టి వారు ప్రవర్తిస్తారు. అది లోకం గొడవ. ఆ గొడవ నీకెందుకు? నీవు బాగుపడే విధానం చూసుకో. నువ్వు చెప్పినట్లు వారు వినరు, వారి స్వభావాన్ని బట్టి వారు ప్రవర్తిస్తారు. ఆగొడవల లోనికి వెళ్ళవద్దు. నువ్వు బాగుపడేవిధానం చూసుకో లేకపోతే నీ శరీరానికి చావు వస్తుంది. ఇక్కడకు వచ్చిన టైముఅంతా వేస్టు అవుతుంది. మరల ఈ మానవజన్మ రాకపోవచ్చు. అందువలన చిల్లరగొడవలోనికి వెళ్ళి కాలాన్ని పాడుచేసుకోవద్దు. మనకు లోచూపు లేకపోతే ఇతరుల గొడవలలోనికి వెళ్ళిపోతాము. మనకు లోచూపు కలుగుతూ ఉంటే ఈ గొడవలు అన్నీ పోతాయి. మనం ఆధ్యాత్మికంగా పెరగటానికి చాలా కాలం పట్టవచ్చుకాని భగవంతుడే లాక్కుంటే కొన్ని క్షణాలలో ముందుకు వెళ్ళిపోతాము, అది అనుగ్రహం. వీడు మంచివాడు, వాడు చెడ్డవాడు, వాడు పక్కానికి వచ్చాడు, పక్కానికి రాలేదు అని ఈ పిచ్చి గొడవలు నీకు ఎందుకు. హృదయంలో ఉన్నది ఒక్కటే, అక్కడకు చేర్చమని ఈశ్వరుని ప్రార్థించు. ఈ పిచ్చి గొడవలు వేసుకొని ఇలా ఎన్ని జన్మలు తిరుగుతావు. హృదయంలోనికి వెళితేగాని ప్రకృతిమనలను విడిచిపెట్టదు, జ్ఞానోదయం అవ్వదు. ముందు హృదయంలోనికి చూసుకో బంగారం అంతా అక్కడే ఉంది. అరుణాచలం వచ్చినవారు ఎవరూ వట్టిచేతులతో వెళ్లరు. నాస్తికుడు ఆస్తికుడు అవుతాడు, ఆస్తికుడు భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని అవుతాడు. ఆత్మజ్ఞాన సముపార్జన లేకుండా నీ శరీరాన్ని విడచిపెట్టేస్తే చివరకు నీకు మిగిలేది సున్న, నవ్వు భౌతికంగా ఏదైనా సాధించినా అవి అన్నీ ఒకటిలేని సున్నలతో సమానం. మీరు మనస్సును నిగ్రహించుకోలేకపోతున్నారు అనుకోండి, దానిని మర్చిపోతే ఏ గొడవ ఉండదు. మర్చిపోవటమే మందు. అరుణాచలాన్ని స్మరిస్తే మోక్షం వచ్చేస్తుందా అని భగవాన్‌ను అడిగితే అరుణాచలాన్ని స్మరిస్తే మోక్షం వస్తుందని ఈశ్వరుని ఆజ్ఞ అడగటానికి నువ్వు ఎవరు అన్నారు భగవాన్. భౌతికం వేరు ఆధ్యాత్మికం వేరు అని అనుకోవద్దు. భౌతికంగా క్రమశిక్షణలో ఉన్నవారు ఆధ్యాత్మికంగా కూడా అభివృద్ధి లోనికి వస్తారు. సంతోషం, దుఃఖం ఇవి మీ మనస్సులో కలిగే వికారాలు. యదార్థం చెప్పాలంటే సంతోషం, దుఃఖం లేవు అవి ఉన్నాయి అని మనం అనుకొంటున్నాము. సంతోషాన్ని నిగ్రహించుకోలేకపోతే అది గర్వం క్రింద మారిపోతుంది. గర్వం ఎప్పుడైతే వచ్చిందో మనిషి పతనం ప్రారంభమవుతుంది. గాఢనిద్రలో మనకు సంతోషంలేదు, దుఃఖంలేదు. మనస్సు వచ్చాక అవి వస్తున్నాయి. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ముందు మనస్సును నియమించుకోవాలి. మనం ఏదైనా కోరికతో భగవంతుని ప్రార్థిస్తే అది నెరవేరకపోతే ఆయన మీద ప్రేమ, భక్తి పోతుంది. అలా కాకుండా భగవంతుడిని భగవంతుడి కోసమే ప్రేమిస్తూ ఉంటే వచ్చేది ఏదో వస్తుంది. రానిది ఏదో రాదు, ఏది రాకపోయినా మోక్షం వస్తుంది. మనం మంచిపని గౌరవం కోసం చేస్తే గౌరవం రావచ్చు కాని మనస్సు పవిత్రం అవ్వదు. గౌరవం, అగౌరవం ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. ఇక్కడ ఆగిపోతే మనస్సు లోపలకు వెళ్ళదు. మంచి మంచి కోసమే. పని పనికోసమే చేయాలి, పనిలో కూడా దేవుడిని చూడటం నేర్చుకోవాలి. ఎవరిలో ఏ మంచి ఉంటే అది నేర్చుకోవటానికి ప్రయత్నంచేయాలి. ఆంజనేయస్వామి లంకలో అనేక మంచి దృశ్యాలు చూసాడు, అయినా నిర్వికారంగా ఉన్నాడు అందుచేత ఇంద్రియ నిగ్రహం గురించి ఆంజనేయస్వామిని చెపుతారు.

ప్రపంచంతో ఎంతవరకు సంబంధం పెట్టుకోవాలి అని అడుగుతున్నారు. సమాజంతో ఎంతోకొంత అనుబంధం లేకుండా మనిషి బ్రతకలేడు. అందుచేత సంబంధం ఎంతవరకు అవసరమో అంతవరకు సంబంధం పెట్టుకోవాలి కాని అతిగా ఉండకూడదు. అతిగా ఉంటే చిక్కులు వస్తాయి. మన కళ్ళకు లోకం కనబడుతోంది. మన లోపల ఉండి ఎవడో లోకాన్ని చూస్తున్నాడు వాడినే జీవుడు అంటున్నాము. వాడు ఉన్నాడు కాబట్టి లోకాన్ని చూస్తున్నాము. లోకాన్ని చూస్తున్నాము కాబట్టి దానికి ఎవరో అధిపతి ఉండాలి కాబట్టి వాడిని దేవుడు అనుకొంటున్నాము. ఏది వచ్చిన తరువాత మిగతావి రెండూ కల్పించబడుతున్నాయో దానిని వదిలేస్తున్నాము. అది కల్పించిన విషయాల కూడా వెళ్ళిపోతున్నాము. మాయ ఇక్కడే ఉంది. మనస్సును పరిష్కారం చేసుకొంటే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనస్సును పరిష్కారం చేసుకోకుండా అది కల్పించిన విషయాలు చుట్టూ తిరుగుతూ ఉంటే కోటి జన్మలు ఎత్తినా మనకు జ్ఞానం రాదు. మనం బాగుచేసుకోవలసింది మనస్సునే. ఆ మనస్సులో ఏమి జరుగుతోందో పరిశీలన చేసుకొంటూ ఆ సమస్యను మనం పరిష్కరించుకొంటే మన హృదయంలో ఉన్న నిజం మనకు తెలుస్తుంది. నాకు దేవుడు కనిపించాడు అంటే మీ మనస్సుకు కనిపించాడు. మీ మనస్సు కళ్ళద్వారా చూసింది. మీకు మనస్సు ఉంటే దేవుడు కనబడటం ఉంది. మనస్సు లేకపోతే ఏదీ లేదు. ఈ మనస్సు ఎవరు అని దానిని పరిష్కారం చేసుకొనే వరకు ఈ గొడవల తప్పవు. ఈ ఆశ్రమంలో మీకు ప్రేమగా సేవచేసేవారు ఉన్నారు అనుకోండి వారిని వదిలేసి ఎక్కడో ఏదో కనిపించింది అంటారు ఏమిటి? వీరికంటే నీకు కనిపించేవి ఎక్కువా? మీ మనస్సు కల్పించిన గొడవలతో వెళ్ళి కాలాన్ని వృథా చేసుకోవద్దు. మీరు దేనినైతే తొలగించుకోవాలో 24 గంటలూ దానిచుట్టూ తిరిగితే అది ఎలా తొలుగుతుంది.

**20-10-2002**

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-11-02, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సన్యాసం అనేది మనస్సుకు సంబంధించిన విషయం. మీరు పని విడిచిపెట్టి ఎక్కడికి పారిపోవద్దు. ఎవరిపని వారు శ్రద్ధగా చేసుకోవాలి. మీ పని మీరు శ్రద్దగా చేసుకొంటూ పని ద్వారా మీరు పొందవలసింది పొందవచ్చు. పని విడిచిపెట్టేస్తే జ్ఞానం వస్తుందని ఎవరూ అనుకోవద్దు. పనికి జ్ఞానానికి విరోధం లేదు. కర్మఫలం ఆశించనంతమాత్రాన అదిరాదు అని అనుకోవద్దు. ఆశించిన, ఆశించకపోయిన ఆ దేహప్రారబ్దమును బట్టి వచ్చేది ఏదో ఆఫలితం వస్తుంది. కర్మఫలం ఆశించకుండా ఉంటే చిత్తశుద్ధి కలుగుతుంది. భౌతికంవేరు, ఆధ్యాత్మికం వేరు అనుకోవద్దు. భౌతికంగా మీకు వచ్చేమంచి ఆలోచనలు, మీరు చేసే మంచిపనులు, మీరు మాట్లాడే మంచిమాటలు ఇవి అన్నీ కూడా ఆధ్యాత్మికఅభివృద్ధికి సహకరిస్తాయి. ఈ ప్రపంచం అంతా ఒక ట్రైనింగ్ గ్రౌండ్. మన మనస్సును పవిత్రం చేసుకోవటానికే ఈ భూమి మీదకు వచ్చాము. మనకు తెలిసినవిషయాలను ఆధారంగా చేసుకొని తెలియనివిషయాలు తెలుసుకోవాలి. మనశరీరం పుడుతుంది, పెరుగుతుంది, చనిపోతుంది. సత్యం అనేది మన శరీరం లాంటిది కాదు సాంఘిక పరిస్థితుల వంటిదికాదు, అది పంచభూతాలమీద , జీవకోటిమీద ఆధారపడినదికాదు. అది స్వతంత్రమైనది, నిర్మలమైనది, పవిత్రమైనది, జ్ఞానమైనది. మన శరీరం ఎలా పుడుతుందో అలా పుట్టేది కాదు. ఇది ముందు మనకు అర్ధమవ్వాలి. దేహము యొక్క ప్రారబ్దాన్ని అనుసరించి ఏదైతే ఈ జీవకోటిని నడిపిస్తోందో, దేనివలన సూర్యుడు ప్రకాశిస్తున్నాడో, పంచభూతాలు వాటిపని అవి చేస్తున్నాయో దానినే సత్యంఅంటారు, దానినే బ్రహ్మం అని పిలుస్తారు. అది అంతటా ఉంది, మన హృదయంలోను ఉంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. మన మనస్సు, మాట, చేత ఒకటిగా ఉండాలి. ఈ మూడు ఒకటిగా ఉంటే మనం చేసే సాధనలు రాణిస్తాయి. ఈ మూడూ ఒకటిగా లేకపోతే మీరు ఎన్నిసాధనలు చేసినా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మనం ఆలోచించేది మాట్లాడగలగాలి, మనం మాట్లాడినది చేయగలగాలి. అప్పుడు ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. ఏది ఉదయించిన తరువాత దేహభావన వస్తోందో, ఏది వచ్చిన తరువాత దేవుడు వస్తున్నాడో, ఏది వచ్చిన తరువాత పుణ్యపాపకర్మలు వస్తున్నాయో దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయటం మనందరము మానివేసాము, ఇదే మనం చేస్తున్న పొరపాటు. మనోమూలంలో ఉన్న వస్తువుమీద మీకు దృష్టి లేదు, మనస్సు కల్పించిన విషయాలకు ఆకర్షింపబడుతున్నారు. నీకు ఉండవలసింది యోగదృష్టికాని భోగదృష్టికాదు.

మీరు కాని విషయాల మీద మనస్సును పెట్టవద్దు. సత్యంకానిదానిమీద మనస్సును పెట్టి సత్యాన్ని తెలుసుకోవాలి అనుకుంటున్నారు, అది ఎలా సాధ్యమవుతుంది. మనోమూలంలో ఉన్న సద్వస్తువు మీద నీమనస్సును పెట్టటంలేదు, ఏదైతే ఉందో అక్కడ నీమనస్సును పెట్టు, అదే సాధన. ఏదైతే నీవు కాదో అక్కడ నీ మనస్సును పెట్టటం అది సాధన కాదు, దాని వలన నీకువచ్చేది యోగం కాదు, రోగం వస్తుంది. మీరు ఎక్కడికి పారిపోవద్దు. మీరు ఇంటిదగ్గర మీపనిని చేసుకోండి. అంటే భగవంతుడు మీకు నియమించిన పనిని శ్రద్దగా చేసుకోండి. భగవంతుడు దృష్టిలో ఇది చిన్నపని, ఇది పెద్దపని అని లేదు, మీకు ఏపని అయితే అప్పగించాడో ఆపనిని ప్రేమగా, ఇష్టంగా, ఉద్రేకం లేకుండా చేయండి. అలా నిర్మలంగా పనిచేస్తూ ఉంటే భగవంతుని దయకు పాత్రులవుతారు. ఆయన దయకు ఎప్పుడైతే పాత్రులయ్యారో పరమాత్మ మీకు తెలియబడతాడు. ఎవరుఏదిచెప్పినా మీరు స్వంతంగా ఆలోచించుకోండి, బుడబుక్కలమాటలు వేసుకొని తిరగవద్దు. మనం కాళ్ళతో నడుస్తాము. చేతులతో పనిచేస్తాము. అలాగే మనకు భగవంతుడు ఆలోచించుకోవటానికి మెదడు ఇచ్చాడు. కాని మనం మెదడును ఉపయోగించుకోవటంలేదు దానికి కారణం సోమరితనం. మనకు కాలం విలువ తెలియటంలేదు, ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియటం లేదు, సమాజంతో ఎలా ప్రవర్తించాలో తెలియటంలేదు, సమాజంతో అనుబంధం ఎంతవరకు ఉండాలో తెలియటంలేదు, కనీసం తెలుసుకోవాలనే ప్రయత్నం లేదు, ఇది దురదృష్టం. జిజ్ఞాస లేకుండా జ్ఞానం రాదు. తెలుసుకోవాలనే కాంక్ష లేకపోతే వ్యవహారిక విషయాలే తెలియబడవు, ఇంకలోపలఉన్న సత్యం ఎలా తెలుస్తుంది. లోపలఉన్న వస్తువు అభౌతికమైనది, అలౌకికమైనది. అది నీ మాటకు, మనస్సుకు అందదు. దానికి నామం లేదు, రూపంలేదు. కాని నామాన్ని, రూపాన్ని ఉపయోగించుకొని నీ మనస్సును జాగ్రత్తగా ఉపయోగించుకొని, భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను జాగ్రత్తగా ఉపయోగించుకొని, సద్గ్రంథపఠనం చేస్తూ, సత్పురుషుల సహవాసం చేస్తూ నీహృదయంలోఉన్న సత్యవస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఏసి గదిలో ఉన్నప్పుడు మీ శరీరం ఎలా ఉంటుందో, మీకు శరణాగతిమార్గం అర్ధమయితే మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నీ మనస్సు అంత కూల్‌గా, క్వైట్‌గా ఉంటుంది. ఆత్మవిశ్వాసం ఎప్పుడూ చెడగొట్టుకోవద్దు. మిమ్మల్ని చూసి ఎవరైనా అసూయ పడుతున్నారు అనుకోండి, వారు మీ ఆత్మవిశ్వాసం చెడగొట్టటానికి ప్రయత్నం చేస్తారు. అప్పుడు ఆత్మవిశ్వాసం చెడిపోతూ ఉంటే వాళ్ళ చేతిలో మీరు ఓడిపోతారు. ఆత్మవిశ్వాసం లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. మీ మీద మీకే నమ్మకం కలగనప్పుడు లోపలఉన్న బ్రహ్మంమీద నమ్మకం ఎలా కలుగుతుంది. ముందు నీకు జీవుడు తెలుస్తున్నాడు, తెలియని విషయాలు వదిలెయ్యి, ఆ జీవుడి యొక్క మూలాన్ని తెలుసుకో, జీవలక్షణాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి, ఏ బలహీనతలయితే నీ మనస్సును బాహ్యముఖానికి తీసుకొని వస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి, మీ మార్గంలో మీరు ప్రయాణం చేయండి. ఆహారంవిషయంలో, మాటలవిషయంలో, వ్యవహారంవిషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. అది కూడా సాధనలో ఒక భాగం. ఈ దేహంతో ఏవో పనులు చేస్తాము. వచ్చిన ఫలితాన్ని ఎంజాయ్ చేస్తాము. ఇలా ఎంజాయ్ చేసినప్పుడు వాసనపడుతుంది. ఆ వాసనలోనుండి తలంపు వస్తుంది. ఆ తలంపునుబట్టి మరల పనిచేస్తాము. ఇది ఒక చక్రం, ఈకర్మచక్రాన్ని బట్టి దేహాలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి. కాని సత్యం అనేది మనం అనుకునే విషయాలన్నింటికి అతీతమైనది. ఎర్రబట్టలు కట్టుకొన్నంత మాత్రం చేత సన్యాసం కాదు, సన్యాసం అనేది మనస్సుకు సంబంధించినది. కర్మఫలత్యాగి సన్యాసి అని భగవంతుడు చెప్పాడు.

**రమణ భాస్కర**

**20-10-2002**

నీవు ఏప్రదేశంలో ఉన్నావు అనేది ముఖ్యం కాదు. ఫలాపేక్ష లేకుండా నువ్వుఎంతవరకు పనిచేయగలుగుతున్నావు, ఎంతవరకు మాట్లాడగలుగుతున్నావు అనేది చూసుకోవాలి. భగవాన్ అరుణాచలేశ్వరుడి గురించి చెపుతూ అడిగిన వారికి అడిగినదే ఇస్తావు అడగనివారికి అన్నీ ఇచ్చి, మోక్షాన్ని ఇస్తావు అన్నారు. ఒక ఆస్ట్రేలియన్ భక్తుడు నాన్నగారితో ఇలా అన్నాడు నేను చాలామంది జీవితచరిత్రలు చూసాను. భౌతికపరంగా కాని, ఆధ్యాత్మికపరంగా కాని స్వార్థం ఉన్నవారి కంటే స్వార్థం లేనివారిలోనే ఎక్కువ పురోగతి వచ్చింది. స్వార్థం ఉన్నవాడు నేనుఅభివృద్ధిలోనికి వస్తున్నాను అనుకొంటాడు. కాని స్వార్థంలేనివాడు వీడికంటే అభివృద్ధిలోనికి వస్తాడు అన్నసంగతి స్వార్థంఉన్నవాడికి తెలియదు.

యుద్ధంలో ఇంకోగంటలో ఈ ప్రాణాలు ఉంటాయో, లేదో అనే టైములో కృష్ణుడు భగవద్గీత చెప్పాడు. కృష్ణుడు ఆ టైమునే ఎందుకు ఎన్నుకొన్నాడు అంటే మన జీవితంకూడా ఒక యుద్ధంలాంటిదే. నీ మనస్సులో మంచితలంపులు, చెడుతలంపులు ఉంటాయి. వాటి మధ్య యుద్ధం జరుగుతోంది. ఆ యుద్ధంలో నీవు నెగ్గాలి. జీవితాన్ని విడిచిపెట్టి ఎక్కడికి పారిపోవద్దు. బ్రతకటం కష్టంకాని చనిపోవటం తేలికే. శరీరం పుట్టినది మొదలు స్మశానానికి వెళ్ళేవరకు ఎవరి జీవితం సమానంగా వెళ్ళదు. మనకు కష్టంవచ్చినా, సుఖంవచ్చినా వాటినుండి పాఠాలు నేర్చుకోవాలి. సంతోషం, దుఃఖం ఇవి అన్నీ ఫీలింగ్స్ మాత్రమే. గాఢనిద్రలో నీకు సంతోషం లేదు, దుఃఖం లేదు. ఈ ఫీలింగ్స్‌కు అతీతంగా సత్యం ఒకటి నీ హృదయంలో ఉంది. ఈ దుమ్మునంతా క్రియేట్‌చేసేది మూలతలంపే. దేహమునేనుఅనేతలంపు నుండే ఇతరతలంపులు వస్తున్నాయి. దేహమునేనుఅనేతలంపు ఎక్కడ నుండి ఉదయించి వస్తోందో అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు. ఆయన నీకు అనుభవంలోనికి వచ్చేవరకు నీకు స్వేచ్ఛలేదు, సుఖంలేదు, ఆనందంలేదు. సన్యాసం అంటే ఇల్లు విడిచిఎక్కడికో పారిపోవటం కాదు. నీవు ఎక్కడికి వెళ్లినా పంచభూతాలు ఉంటాయి, నీ మనస్సు నీకూడా వస్తుంది, నీ ఇంద్రియాలు నీకూడా వస్తాయి, రాగద్వేషములు నీకూడా వస్తాయి. వాటిని ఫేస్‌చేసి, వాటిని ఓవర్‌కమ్ చెయ్యి. నీలో ఏదైనా బలహీనత ఉంది అనుకో దానిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నంచేయాలి గాని పారిపోవటానికి ప్రయత్నంచేయవద్దు. భయం కారణంగా నీవు ఏపని చేయవద్దు, ఏదీ మాట్లాడవద్దు. నీవు అనుకొన్నట్లు ఏదీ జరగదు, ఇలా జరుగుతుందేమో అని ఊహించుకోవటంలోనే భయం వస్తుంది. నీకువచ్చేతలంపులకు భయం ప్రేరణగా ఉండకూడదు. విచారణ ప్రేరణగా, శాంతి ప్రేరణగా ఉండాలి. మీకు ఏదైనా తలంపు వస్తే దానికి వైరాగ్యం పునాదిగా ఉండాలి. లోపల పునాదిలో ధ్యానబలం, ఆత్మబలం ఉండాలి. అప్పుడు అది నీ ఆధ్యాత్మిక అభివృద్ధికే కాదు నీకు, నీకుటుంబానికి, సమాజానికి కూడా ఉపయోగపడుతుంది. మన మనస్సులో ఉన్న దుమ్మును పోగొట్టుకోవటానికే సాధన. మనకు పనికిరాని విషయాలు ఉంటే, చెడుఅలవాట్లు ఉంటే, ఇహానికి పరానికి పనికిరాని తలంపులు వస్తూ ఉంటే ఆ తలంపులను తీసి బయటపెట్టటమే సాధన. ఉన్నదేదో ఉంది, మీకు తెలిసినా తెలియకపోయినా అది ఉంది. మీకు తెలియనంతమాత్రంచేత నీ హృదయంలో అది లేదు అనికాదు. సత్పురుషులతో, యోగులతో, మహర్షులతో పవిత్రులతో సహవాసం ఎందుకంటే వారి సమక్షంలో కూర్చున్నప్పుడు వారికి

**20-10-2002**

ఏ వస్తువు అయితే అనుభవంలో ఉందో ఆ వస్తువును మనం కూడా తెలుసుకోవాలి అనే బుద్ధి మనకు కలుగుతుంది. నీవు ఏ రంగంలో బాగుపడాలన్నా ముందు గర్వంరాకుండా చూసుకో. గర్వం వచ్చిందా నీ పతనం ప్రారంభమవుతుంది.

జీవితం ఒక సినిమా లాంటిది. సినిమాలో మనకు నచ్చిన దృశ్యాలు ఉంటాయి. నచ్చని దృశ్యాలు కూడా ఉంటాయి. కొంతభాగం మనకు నచ్చలేదు అని సినిమా మరల తీయటం కుదరదు. అలాగే తల్లికడుపులో నుండి శరీరం బయటకువచ్చిన తరువాత స్మశానంకు వెళ్ళే వరకు ఆ జీవుడి యాత్ర తీసిన సినిమా లాంటిది. దేహప్రారబ్ధమునుబట్టి ఆదేహంద్వారా ఏమి జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది. ఆ పని పూర్తి అయిన తరువాత దేహం నశిస్తుంది. దేహాన్నిస్మశానంలో తగులబెట్టినప్పుడు దేహగతమైన చరిత్ర ముగుస్తుంది కాని జీవుడియొక్క చరిత్ర ముగియదు. ఆ జీవుడికి లోకజ్వరం తగ్గేవరకూ వేరుబుద్ధి నశించేవరకు, మనస్సులోఉన్న, చీకటి కోణాలు పోయేవరకు జీవుడు అలా ప్రయాణంచేస్తూనే ఉంటాడు. మనస్సు అనేది మున్సిపాలిటీ సమస్యకాదు, గవర్నమెంట్ సమస్య కాదు, అది నీ సొంతసమస్య. దానిని నీవే పరిష్కారం చేసుకోవాలి. నీ మనస్సును స్నేహితుడిగా చేసుకో. నిన్ను నీవు ఉద్ధరించుకోవటానికి ప్రయత్నం చేసుకో. ఎవరో ఇతరులువచ్చి సహకారంచేస్తారనిఎదురుచూడవద్దు. మనకాళ్ళమీద మనం నిలబడటం నేర్చుకోవాలి. మనకు బయటఉన్న శత్రువుల కంటే లోపలఉన్న శత్రువులే ఎక్కువ అపకారం చేస్తారు. నీవు పరిస్థితులను అర్థంచేసుకొని, పరిస్థితులతో రాజీపడి భగవంతుడు మనకు కేటాయించిన పనిని నిర్మలమైన బుద్ధితో, ఇష్టంగా, ప్రేమగా, శాంతిగా ఆ పనిచేస్తే నీ మనస్సునశిస్తుంది. ఇష్టం లేకుండా పనిచేస్తే వచ్చేజన్మలో ఆపనే భగవంతుడు మనకు అప్పగిస్తాడు, ఇష్టంతో చేస్తే కర్మను నీవు విడిచిపెట్టనక్కరలేదు, కర్మే నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. నీవు నిర్మలంగా చెయ్యి, లోదృష్టి అలవర్చుకో ఆడంబరాలకు వెళ్ళవద్దు. కృత్రిమగౌరవాలకు అలవాటుపడకు. నీ మాటలో, చేతలో, ఆలోచనలో ఆడంబరం వద్దు. అప్పుడు నీకు లోచూపు కలుగుతుంది. లోచూపు కలిగేకొలది మాటలు, తలంపులు తగ్గుతాయి, తూకం పెరుగుతుంది. తూకం పెరిగినప్పుడు భగవంతుడు ఏ హృదయంలో అయితే ఉన్నాడో అక్కడకు మీరు వెళ్ళగలరు. మాటలు, తలంపులు ఎక్కువవుతూ ఉంటే మనకు సాధన లేదని అర్థం. గుర్తింపులకోసం ఏపనీ చేయవద్దు, ఈశ్వరుని దయ సంపాదించటం కోసం పనిచెయ్యి.

దేహప్రారబ్ధమును బట్టి మన దేహం ద్వారా ఏ పనిజరగవలసిఉందో మనకు ఇష్టంఉన్నా, ఇష్టంలేకపోయినా ఆ పని జరుగుతూ ఉంటుంది, కాని మీరు దానితో తాదాప్యం పొందవద్దు. మీరు ఆలోచన విడిచిపెట్టవద్దు. భగవంతుని మీద విశ్వాసం విడిచిపెట్టవద్దు. సర్వకాలసర్వావస్థలలో మీ మనస్సును శాంతిగా ఉంచుకోవటానికి, నిర్మలంగా ఉంచుకోవటానికి ప్రయత్నం చేయండి. మీకు అవకాశం ఉన్నప్పుడు జపం చేయండి, ధ్యానం చేయండి. జప ధ్యానములు ఇంద్రియనిగ్రహానికి, మనోనిగ్రహానికి సహకరిస్తాయి. నేను అది సాధించాను, ఇదిసాధించాను అనుకొంటూ కూర్చోవద్దు, అలా అనుకోవటం వలన అహంకారం పెరుగుతుంది. అసలు నువ్వు అంటూ లేవు ఉన్నది ఈశ్వరుడే. మనం ఉన్నాము అనుకొంటున్నాము కాని మనం లేము ఉన్నది ఆయనే. రాగద్వేషములు తగ్గించుకోండి.

**రమణ భాస్కర**

మీ నిదానంలో మీరు ఉంటూ, ఉద్రేకపడకుండా నిర్మలంగా ఉంటూ, ఏది వచ్చినా ఇది భగవంతుడి ప్రసాదమే అనుకొంటూ, మీ పని ఏదో మీరు ప్రశాంతంగా చేసుకొంటూ వెడితే భగవదనుభవం పొందటానికి మీకు అడ్డువచ్చే విషయాలు అన్నీ భగవదనుగ్రహం వలన అన్నీ పోతాయి. పనిచేసేటప్పుడు శ్రద్ధగా చేయండి. మాట్లాడేటప్పుడు శ్రద్ధగా మాట్లాడండి, అది లోకానికి సంబంధించిన విషయం అయినా సరే అశ్రద్ధపనికిరాదు. అప్పుడు కూడా భగవంతుని దయ మీకు కలుగుతుంది. మాటలో పొందిక ఉండాలి మాట దేవుడితో సమానం కాబట్టి మాటల విషయంలో జాగ్రత్తగా ఉండండి. భగవంతుడు ఎక్కడో ఉన్నాడుఅనుకోవద్దు, నీలోపల ఉన్నాడు, నీకూడా ఉన్నాడు, నీ శరీరం మరణించిన తరువాత నీకూడా వస్తాడు. భగవంతుడే మనకు నిజమైన గురువు, ఆయనే మనకు నిజమైన సహచరుడు, నిన్ను ఒక్కక్షణం కూడా ఆయనవిడచిపెట్టడు, కాని ఆయనను అనుభవంలోనికి తెచ్చుకోవడానికి ఒక్కక్షణం కూడా మనం ప్రయత్నం చేయటం లేదు, కాలాన్ని వృధా చేసుకొంటున్నాము. చేతులతో పనిచేసుకోండి, మన మనస్సును భగవంతుని మీద పెట్టండి, మమకారం తగ్గించుకోండి. మమకారం తగ్గించుకొంటే మీ మనస్సు భగవంతుని వైపు తిరుగుతుంది. మీరు తొందరపడవద్దు, భగవంతుని సహకారం వస్తుంది, మీ బాధ్యతలను ఆయన మోస్తాడు. ఏదిక్కులేని వారికి దేవుడే దిక్కు. భగవంతుడే మనకు నిజమైన చుట్టం, ఆయనే మనకు నిజమైన ఆస్తి. ఆయన నిరంతరం నీకూడా ఉంటాడు. నీ జాగ్రదవస్థలో, స్వప్నావస్థలో, గాఢనిద్రలో కూడా ఆయన నీ హృదయంలో ఉన్నాడు. అట్టి భగవంతుడిని తెలుసుకోవటం మానివేసి ఎందుకు కాలాన్ని పాడుచేసుకుంటావు. అక్కరలేని గొడవలలోనికి వెళ్లవద్దు. మీ పని ఏదో మీరు చేసుకొంటూ భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేసుకోండి. ఒక్కమాట మీరు బాగాగుర్తుపెట్టుకోండి. జ్ఞానం అంతా మౌనంలోనే ఉంది. దక్షిణామూర్తి మౌనంలోనే బోధించాడు. మాటలు చెప్పలేనిది, తలంపులు చెప్పలేనిది మౌనం బోధిస్తుంది. ఆత్మతత్వాన్ని మౌనం చెప్పినంత సమగ్రంగా మాటలు, తలంపులు చెప్పలేవు. మౌనం జ్ఞానాన్ని పట్టిఇస్తుంది. అంతే కాదు జ్ఞానమంతా మౌనంలోనే ఉంది. అసలు మాట్లాడవద్దనికాదు, ఎక్కువగా మౌనాన్ని ప్రాక్టీసు చేయండి. భగవంతుని పాదాలను ఆశ్రయించండి, ఆయనను అనుభవంలోనికి తెచ్చుకోండి, మన జీవితలక్ష్యం అదే. రామకృష్ణుడు ఏమి చెప్పాడుఅంటే ఒక మంచి మామిడిచెట్టు ఉంది అనుకోండి, దానికి పళ్ళువేలాడుతూ ఉన్నాయి అనుకోండి. దానిని చూసి మనం ఏమనుకొంటాము ఆ చెట్టు ఎంత బాగుంది, ఎంత బాగా కాసింది, పళ్ళు ఎంత అందంగా ఉన్నాయి అనుకొంటాము. అలాగే పరబ్రహ్మం ఒక వృక్షం లాంటివాడు. ఋషులు, యోగులు, మహాత్ములు ఆ మహావృక్షానికి కాసిన పళ్ళు లాంటివారు అని చెప్పాడు. జ్ఞానపూరితమైన మాట, కాంతిపూరితమైన మాట, శాంతిని కలుగజేసే మాట ఏ మొఖంలోనుండి వచ్చినా మనం దానిని ఆస్వాదించాలి. అలా ఆస్వాదించలేకపోతే మన బుద్ధి పాడుబుద్ధి అని అర్థం.

**సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-02, పాతళ్ళమెరక**

**20-10-2002**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రూపదృష్టి, నామదృష్టి తగ్గించుకోమని మన పెద్దలు చెప్పారు. మన హృదయంలో ఉన్నవస్తువు మనకు తెలియకుండా ఈ రెండే మనకు అడ్డువస్తున్నాయి. మనకు తెలిసినా, తెలియకపోయినా మరణంలేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. అది తెలిస్తే మనకు సుఖం కలుగుతుంది, అమృతత్వం పొందుతాము. అతి తెలియకపోతే దుఃఖం, మృత్యువుకు గురవుతాము. రూపభావన, నామభావన వలననే మనకు అహంభావన పెరుగుతోంది. మనలో ఉన్న చైతన్యం గుర్తింపులు కోరదు ఎందుచేతనంటే దానికి ఇతరులు లేరు. అహంభావనకు ఇతరులు ఉన్నారు. అహంభావనను కేంద్రంగాపెట్టుకొని జీవిస్తున్నంతకాలం గుర్తింపులు కోరకుండా ఉండలేము. సాధన పేరు చెప్పి అహంభావనను తొలగించుకోవాలి గాని అహంభావనను పెంచుకోకూడదు. ఉన్నదేదో నీ హృదయంలో ఉంది. నీవు సాధన చేసి పోగొట్టుకోవలసింది దేహాత్మభావన ఒక్కటే, నీ సాధన యొక్క గమ్యం అదే. దేహబుద్ధి నశించిన మరుక్షణంలో నీకు శివబుద్ధి కలుగుతుంది. మన దైనందిన జీవితంలో మన మాటలోగాని, తలంపులోగాని, చేతలోగాని దేహభావన పెంచుకోకూడదు. వీటిద్వారా దేహభావన తగ్గించుకొంటూ రావాలి. పనిలోదేవుడుని చూడాలి. లోకం గుర్తింపులకోసం మనం పని చేస్తే పదిమంది మనకు జైకొట్టవచ్చుగాని ఈశ్వరానుగ్రహానికి పాత్రులంకాలేము. మనకు మోక్షం ఇచ్చేవాడు ఈశ్వరుడే గాని లోకంకాదు. అందుచేత మనం ఏపని చేసినా ఈశ్వరానుగ్రహం పొందాలి అని దృష్టిలోపెట్టుకొని చేయాలి. మనకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండటం వలన ఆధ్యాత్మిక అభివృద్ధిలో వెనుకబడుతున్నాము. అన్ని నియమములోనికి ఆహార నియమం ఉత్తమమైనది. అందుచేత ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. నీకు హితమైనది మితంగా తినాలిగాని అతిగా తినకూడదు. శరీరం యొక్క అవసరాన్ని బట్టి తినాలి గాని రుచికోసం తినకూడదు. మన మాట సౌమ్యంగా ఉండాలి, హితువుగా ఉండాలి, ఇతరులను ఎడ్యుకేట్ చేసేదిగా ఉండాలి. మన మాట మనకు చల్లదనం కలుగజేయాలి. ఇతరులకు చల్లదనం కలుగచేయాలి. అందుచేత మాటల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనం అవసరంలేని మాటలు ఎక్కువగా మాట్లాడుతూ ఉంటాము. అవసరం లేకుండా మాట్లాడటం వలన మనకు తెలియకుండా అహంభావన పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు, వాడు హృదయం యొక్క లోయలలోనికి వెళ్లలేడు. ఒక మనిషి ఎంత చెడ్డవాడైనప్పటికి వాడిని ద్వేషించవద్దు. వాడిని ద్వేషిస్తే మనకు శాంతి పోతుంది, మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, మనం ధ్యానం చేయాలన్నా వాడి నామరూపములే జ్ఞాపకం వస్తాయి మన ధ్యానం చెడిపోతుంది. జీవుడు యొక్క సోర్సు ఏమిటి, ఎక్కడ నుండి ఉదయిస్తుంది అని దానిని విచారణలో పెట్టకుండా, అది ఉదయించిన తరువాత ఏ విషయాలు అయితే కల్పిస్తోందో ఆ విషయాల

**రమణ భాస్కర**

వెంట పరుగెడుతున్నావు ఇంక నీకు సత్యాన్వేషణ సాధ్యంకాదు.  ఏ వస్తువును తెలుసుకొన్నాక ఇంక తెలుసుకోవలసినది ఏదీ మిగలదో ఆ వస్తువును తెలుసుకోవటం మీద నీ సాధనను గురిపెట్టటం లేదు. గుడిలో అభిషేకం చేస్తున్నారు.  అభిషేకం అభిషేకం కోసమే ఎంతమంది చేస్తున్నారు? ఏదో వస్తుందని ఆశించి చేస్తున్నారు. అది నేరమని నేను చెప్పటంలేదు, దానివలన మనకు వ్యాపార మనస్తత్వం వచ్చేస్తుంది, మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది.  పనిపనికోసమే చెయ్యండి, ప్రేమ ప్రేమకోసమే భగవంతుడిని ప్రేమించండి. సహనాన్ని ప్రాక్టీసు చేస్తున్నారు అనుకోండి, లవ్‌ను ప్రాక్టీసు చేస్తున్నారు అనుకోండి వ్యక్తిభావన స్లోగా రెడ్యూస్ అయిపోయి అంటే నెమ్మదిగా పల్చబడి అదృశ్యమయిపోతుంది. మనం పనిని బ్రహ్మభావనతో చేయటంలేదు, దేహభావనతో చేస్తున్నాము బ్రాహ్మీస్థితిని పొందాలనుకొంటున్నాము, ఇలా సమన్వయం అసలు కుదరదు. నువ్వు బ్రాహ్మభావనతో పని చేస్తూ ఉంటే ఏదో రోజున బ్రాహ్మీస్థితిని పొందుతావు.

నాకు భగవంతుడిని తెలుసుకోవాలని ఉంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవంతుడు ఎప్పడైనా వచ్చి ఆయనను తెలుసుకోమని అడిగాడా అంటున్నారు భగవాన్.  ఆయన ఎప్పడూ నన్ను అడగలేదు అని చెప్పాడు అయితే అ గొడవ నీకు ఎందుకు అన్నారు. నీకు కావలసింది భగవంతుడు కాదు, నీకు సుఖం కావాలి, శాంతి కావాలి, ఆనందం కావాలి దానికి భగవంతుడు అని పేరు పెట్టావు అంతే .  లోపల ఉన్న వస్తువు ఉన్నది ఉన్నట్లుగా మనకువ్యక్తమయినప్పడు మనకు ఎటుచూసినా సుఖమే, ఎటు చూసినా శాంతే. అప్పడు దేహం ఉన్నా లేకపోయినా, లోకం కనిపించినా కనబడకపోయినా అసలు బేధం కనిపించదు.   అక్కడ మన సాధనను గురిపెట్టాలి.  ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు.  ఉన్నదానిని నీవు లేదు లేదు అనుకొన్నా ఉన్నది లేకుండా పోదు.  లేని దానిని నీవు ఉంది అనుకొన్నా అది లేదు. నువ్వు కాని దాని మీద నీ మనస్సును నిలబెట్టినా అది నువ్వు అవ్వవు.  నువ్వు ఏదైతే అవునో దాని మీద నీమనస్సును నిలబెడితే అది నువ్వు అవుతావు, నీ మనస్సును అక్కడ నిలబెట్టి ఉంచటమే సాధన.  నేను అందరి హృదయాలలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు, దానిని గ్రహించే శక్తి మనకు లేదు.  ఎవరైనా ద్వేషిస్తూ ఉంటే భగవంతుడిని ద్వేషించినట్లే అవుతుంది, ఎవరికైనా అపకారం చేస్తే భగవంతుడికి అపకారం చేసినట్లు అవుతుంది ఎందుచేతనంటే అక్కడ లోపల ఈశ్వరుడు లేకుండా ఆదేహంరాదు.  నేను మిమ్మల్ని స్మరించుకొంటున్నాను. స్మరించటం వలన నాకు ఏకాగ్రతరావాలి, పవిత్రతరావాలి.  రమణారమణా అనేటప్పటికి  నేను పవిత్రుడను అవ్వాలి, మనస్సు యొక్క చాపల్యం తగ్గాలి.  నేను ఆధ్యాత్మికంగా పెద్ద బలవంతుడిని కాదు, మీ అనుగ్రహం కావాలి, మీ దగ్గరనుండి సహాయ సహకారములు అర్ధిస్తున్నాను అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు.  అగ్ని వేడిలేకుండా ఉండదు అలాగే చైతన్యం అనుగ్రహం లేకుండా ఉండదు.  రమణారమణా అంటే అక్కడ



చైతన్యమే.  రమణుడిని ఒకరూపానికి, ఒక నామానికి పరిమితం చేయనక్కరలేదు.  నన్ను స్మరించుకొంటున్నాను అని అంటున్నావు, దేని వలన స్మరించుకొంటున్నావు?  నీలోపల చైతన్యం ఉంది. దాని అనుగ్రహం లేకుండా, దాని దయ లేకుండా నన్ను స్మరించుకొంటున్నావా? ఆ స్మరించుకోవటం కూడా నీ సొంతం కాదు.  ఏ వస్తువునయితే నీవు తెలుసుకోవాలనుకొంటున్నావో ఆ వస్తువు యొక్క దయ వలననే ఆ వస్తువును స్మరిస్తున్నావు.  నీ పేరు లక్ష్మి అనుకో.  భగవంతుడికి భిన్నంగా లక్ష్మి ఉందా? భగవంతుడి కంటే వేరుగా లక్ష్మి ఉంది అనుకొంటే అది లక్ష్మి అవ్వదు.  ఇది తెలుసుకొంటే జ్ఞానం తెలియకపోతే అజ్ఞానం. నేను మీ మనస్సులో ఉన్నదోషాలు చూడటం కాదు, నా మనస్సులో ఉన్న దోషాలు చూసుకొని వాటిని సవరించుకొంటే నాకు జ్ఞానోదయం అవుతుంది.  మీరు ఎలా మాట్లాడుతున్నారు అనేది ముఖ్యంకాదు, నేను ఎలా మాట్లాడుతున్నాను అనేది నాకు ముఖ్యం ఎందుచేతనంటే నా మాట చేత తలంపు మీద నా ఆధ్యాత్మిక అభివృద్ధి ఆధారపడి ఉంది.  నువ్వు రమణానుగ్రహం లేదనుకొంటావు ఏమిటి?  రమణానుగ్రహం వలననే రమణా అనుకొంటున్నావు, అనుగ్రహం లేకపోతే నీ నోటి వెంట రమణా అనే మాట కూడా రాదు.  అనుగ్రహం పనిచెయ్యనిక్షణం అంటూ ఉన్నదా?  అనుగ్రహాన్ని నీవు అందుకోలేక పోతున్నావు.  చైతన్యానికి మరొక పేరే అనుగ్రహం.  అది ఎప్పడూ ఉంది.  దానిని అందుకోవటానికి మనం అర్హులం అవ్వాలి.   దానికి అర్హత, యోగ్యత సంపాదించాలి. అదే సాధన యొక్క ప్రయోజనం.  ఈశ్వరానుగ్రహం నీమీద లేకపోతే ఆయన స్మరణే నీకు రాదు.  ఎవరి దయవలన, ఎవరి అనుగ్రహం వలన ఆ స్మరణ వచ్చిందో ఆదయే నిన్ను గమ్యానికితీసుకొని వెళుతుంది.  ఇందులో సందేహం అక్కరలేదు.  ప్రతీ చిన్న విషయానికి సందేహించేవాడికి నోటిలో దుమ్ము పడుతుంది. ఈశ్వరుడిని నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము.  ఈశ్వరానుగ్రహం నీమీద ఉంది కాబట్టే ఆయనను స్మరించుకొంటున్నావు.  ఇంక నీకు ఆందోళన ఎందుకు?  అంతా ఆయనే చూసుకొంటాడు.  జీవితంలో నీకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతూ ఉంటాయి.  నాకు ఇష్టంలేదు, ఈ సంఘటనలు ఇలా జరుగుతున్నాయి ఏమిటి అని నీవు అనుకొంటున్నావు.  ఆ ఇష్టం లేని సంఘటన కూడా నీకు మంచి తీసుకొని రావచ్చు, అది నీకు తెలియదు.  ఇష్టంలేని సంఘటనలు జరుగుతూంటే  మనకు ఆందోళన వస్తుంది. మీరు ప్రతీ చిన్న విషయానికి ఆందోళన పడుతూ ఉంటే ఈశ్వరుడి అస్థిత్వం పట్ల మీకు నమ్మకంలేదు అని అర్థం. నోటితో ఈశ్వరుడు ఉన్నాడు అని చెప్పి, మీ మనస్సుతో వెక్కిరించవద్దు.  మీ మనస్సు అశాంతికి గురిఅవుతూ ఉంటే మీకు ఈశ్వరుడి పట్ల విశ్వాసం లేదు అని అర్థం, మనస్సుతో వెక్కిరించటం అది.  భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు.  ఆయనను పొందటానికి మనకు ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి.  మనం ప్రేమించవలసింది భగవంతుడిని, సైతానును కాదు.  మనకు సైతాన్ మీద ఉన్న విశ్వాసం కూడా

భగవంతుడి మీద లేదు. ఇతరులను పీడించటం ఎంత దోషమో నీ మనస్సుని నీవు పీడించుకోవటం కూడా అంతేదోషం. నిరంతరం ఏదో కల్పించుకొంటూ, ఊహించుకొంటూ బాధపడిపోతూ ఉంటారు, అది మంచిదికాదు. మనిషికీ మనిషికీ ఉన్న సంబంధం కేవలం అహంభావనమీద ఆధారపడి ఉంటుంది. మనకు నిజమైన బంధువు ఈశ్వరుడు ఒక్కడే. మరణానంతర జీవితంలో మనకూడా వచ్చేవాడు ఈశ్వరుడు ఒక్కడే. భగవంతుడి నామానికి ఎంత శక్తి ఉంది అంటే మీ యొక్క బలహీనతలను బట్టి మీరు నరకానికి వెళ్ళినా మీరు చేస్తున్న నామం నరకంలోనుండి మిమ్మల్ని విడుదలచేసి స్వర్గానికి తీసుకొని వస్తుంది అని శివానంద చెప్పారు. నామానికి అంతశక్తి ఉంది కాబట్టి నామం విషయంలో మీరు అశ్రద్ధగా ఉండవద్దు. యజ్ఞాలలో జపయజ్ఞం నేను అని కృష్ణుడు చెప్పాడు. అయితే మీరు నామం చేసేటప్పుడు ఆ నామం పట్ల మీకు ప్రేమ ఉండాలి, గౌరవం ఉండాలి, సజీవమైన విశ్వాసం ఉండాలి.

బయట సహాయం లేకుండా నా అంతట నేను కృషి చేసుకొంటూ లోపల ఉన్న సత్యాన్ని గ్రహించగలనా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నారు. అసలు నీకు సత్యాన్ని గ్రహించాలి, సత్యానుభవం పొందాలి అనే తలంపు రావటమే ఈశ్వరుని దయ. ఆయన అనుగ్రహం లేకపోతే సత్యాన్వేషణ బుద్దే నీకు కలుగదు. ఆయన అనుకొన్నాకే నీవు అనుకొంటున్నావు. అసలు నువ్వు అంటూ లేనేలేవు, అంతా ఆయనే. ఆయన అనుగ్రహం వలననే నీకు కదలికవచ్చింది. నీకు ముముక్షత్వం వచ్చింది అంటే అది ఆయన అనుగ్రహం వలననే వచ్చింది గాని లేకపోతే రాదు. ఇది మనకు అర్థంకావటంలేదు. భగవంతుడు అంతర్యామిగా లేకుండా ఏ దేహం ఈ భూమి మీదకురాదు. ఆయన కంటే మనం ఏదో భిన్నంగా ఉన్నాము అనుకొంటే అది మన అహంభావన. సత్యానుభవం పొందటానికే మనం ఈ భూమిమీదకువచ్చాము. కేవలం అన్నంతినటానికి, బట్టలు కట్టుకోవటానికి రాలేదు. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను ధనం ఇచ్చినా, విద్య ఇచ్చినా, తెలివి ఇచ్చినా, మీకు ఏ గిఫ్ట్ ఇచ్చినా దానిని భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకోవాలి. ఒక అమెరికన్ సైంటిస్టు ఏమి చెప్పాడు అంటే నేను సౌత్ ఇండియాలో ఒక ఋషిని చూసాను అప్పటివరకు జీవిత యాత్ర స్మశానంతో ముగిసిపోతుంది అనుకునేవాడిని కాని ఆ ఋషిని చూసిన తరువాత నాకు ఒకటి తెలిసింది. ఈ దేహంతోటి సంబంధం లేకుండా ఈ దేహానికి అతీతంగా పంచభూతాలకు అతీతంగా, జరుగుతున్న సంఘటనలకు అతీతంగా ఏదో ఉందని లోపల నాకు స్ఫురించింది. అంతేకాదు అది నాకు తెలియటంలేదు అన్నసంగతి కూడా నాకు తెలిసింది. ఏదో ఉందని స్ఫురించటం ఆ మహర్షి దర్శనం వలన కలిగింది. అప్పటినుండి సత్యాన్వేషణ ప్రారంభమయింది. సత్పురుషుల సాంగత్యం అటువంటిది అని ఆ సైంటిస్టు చెప్పాడు. అందుచేత కృషి అవసరమే, కృప అవసరమే, నీ కృషిని కాపాడుకోవటానికే సత్పురుషుల సహవాసం. వినయం విడిచిపెట్టవద్దు. ఎట్టిపరిస్థితులలోను నీ మొఖంలో అవినయం రాకుండా చూసుకో. అహంభావనను కేంద్రంగా పెట్టుకొని జీవించేవాడు భౌతిక సంపదకు కూడా దూరమవుతాడు, వాడు ఇహానికి చెడతాడు. పరానికి చెడతాడు. ఎవరైనా మంచిపనులుచేస్తే చూసి సంతోషించాలి. మంచిచూసి సంతోషించలేకపోతే మానసిక దారిద్ర్యం ఉన్నట్లు గుర్తు. మనకు భౌతికంగా దారిద్ర్యం ఉండవచ్చు గాని మానసికదారిద్ర్యం ఉన్నవాడు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందలేడు.

భగవంతుడు గీతలో ద్రవ్యయజ్ఞం, జపయజ్ఞం, జ్ఞానయజ్ఞం అని ఇలా చాలా యజ్ఞాల గురించి చెప్పాడు. ఈ యజ్ఞాల వలన మన మనస్సు నియమింపబడుతుంది, మనకు పుణ్యబలం పెరుగుతుంది, మన మనస్సు నిగ్రహింపబడుతుంది, నిగ్రహింపబడిన మనస్సుకే అంతర్‌దృష్టి కలుగుతుంది, అంతర్‌దృష్టి కలిగిన మనస్సుకే ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనం ఏపని చేసినా యజ్ఞభావంతో చేయాలి. ఎవరికైనా అన్నంపెడితే వాడు మనపట్ల కృతజ్ఞతగా ఉన్నాడా లేడా అని ముఖ్యంకాదు. లోపలతినేవాడు అంతర్యామి భగవంతుడు. అన్నం ఆయన, గరిటె ఆయన, అన్నంపెట్టేవాడు ఆయన, భుజించేవాడు ఆయన, అన్నీ ఆయనే, అదే యజ్ఞభావం. యజ్ఞభావంతో మనం పనిచేస్తే మనలో ఏమైనా దోషాలు ఉన్నా అవిపోతాయి, మనకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నేను ఏదైనా మంచిపని చేస్తూఉంటే దానిగురించి మీరు ఏమి మాట్లాడినా నాకు మీతో సంబంధంలేదు, అది నాకు ఈశ్వరుడికి సంబంధం ఎందుచేతనంటే మోక్షం ఇచ్చేవాడు ఈశ్వరుడే కాని మీరుకాదు. మీరు రాగద్వేషములు తగ్గించుకోవాలి. తలంపులు, మాటలు తగ్గించుకోవాలి. మన ఆరోగ్యం ఎలా చెకప్ చేసుకొంటామో అలాగ ఏరోజుకారోజు మనం మాట్లాడే మాటలు దేనివలన మాట్లాడుతున్నాము అని విచారణ చేసుకోవాలి. మనం అహంభావన వలన మాటలు మాట్లాడుతూ ఉంటే ఆ మాటలు తగ్గించుకోవాలి. నువ్వు సంపాదించవలసింది ఏమీలేదు, పోగొట్టుకోవలసిందే ఉంది. సత్యవస్తువు నీ హృదయంలోనే ఉంది, దానిని ప్రత్యేకించి నీవు సంపాదించనక్కరలేదు. అది అనుభవంలోనికి రాకుండా నీకు ఏ అటంకాలు వస్తున్నాయో చూచుకొని వాటిని తొలగించుకో. అదే సాధన. మీలోపల ఉన్న ఆనందసముద్రం పొంగి మీ సహస్రారాన్ని ముంచటం ప్రారంభించింది అనుకోండి మీకు అసలు ఊపిరాడదు. ఈ ఆనందం చాలు ఇంతకంటే ఎక్కువ ఆనందం వస్తే భరించలేము అని మీకు అనిపిస్తుంది. అట్టిది ఆ ఆనందం, అది అలౌకికమైనది, అభౌతికమైనది. అది ప్రపంచానికి సంబంధించిన ఆనందం కాదు.

**20-10-2002**

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 29-12-2002 | ఆదివారం | పూలపల్లి జడ్డు బ్రహ్మాజీగారి మిల్లు, ఆగర్రు రోడ్డులో |
| 05-01-2003 | ఆదివారం | లంకలకోడేరు, సొసైటీకాలేజ్ ఆవరణ |
| 21-01-2003 | మంగళవారం | మలికిపురం సాయిబాబా మందిరం |
| 26-01-2003 | ఆదివారం | జిన్నూరు రమణక్షేత్రం |

# రమణ భాస్కర పాఠకులకు

# నూతన సంవత్సర శుభాకాంక్షలు 2003



-ఎడిటర్



## లక్ష రుద్రాక్ష పూజ మహోత్సవం

దిII 30-11-2002తేదీ శనివారం జిన్నూరు గ్రామములో వేంచేసియున్న చెన్నమల్లేశ్వరస్వామివారి ఆలయంలో లక్షరుద్రాక్షపూజ కార్యక్రమము దేవస్థానం, మరియు భక్తుల సహకారంతో అత్యంత వైభవముగా జరుపబడినది. జిన్నూరు గ్రామంలో శివాలయం నందు జరిగిన పూజా కార్యక్రమమును, స్వామి వారి, అమ్మవారి విశేష అలంకరణను సద్గురు శ్రీ నాన్నగారు మరియు భక్తులు తిలకించినారు.






మురమళ్ళ గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరేశ్వర స్వామివారి దేవస్థాన ప్రాంగణంలో సద్గురు శ్రీ నాన్నగారు డిసెంబరు 3,4 తేదీలలో ప్రవచనం చేసినారు. మురమళ్ళ చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు ఈ జ్ఞానయజ్ఞమునకు అధిక సంఖ్యలో హాజరైనారు